ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
1★
బుధవారం 1 మే 2024

రామగుండం ఎన్టీపీసీలో గరిష్ఠ ఉత్పత్తి

- ఏప్రిల్‌లో 1449 మిలియన్ యూనిట్లు



రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు

జ్యోతినగర్, ఏప్రిల్ 30 : రామగుండం ఎన్టీపీసీ 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి నెలలో గరిష్ఠ విద్యుత్ ఉత్పత్తి జరిగింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో ప్రాజెక్టు 80.10 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్(పీఎల్ఎఫ్)తో 1445.5 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించింది. గత ఆర్థిక సంవత్సరం గడువుకన్నా నిర్దేశిత విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన రామగుండం ఎన్టీపీసీలో ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా ఉత్పత్తి టార్గెట్‌ను అధిగమిచేందుకు ప్రణాళికలు రూపొందించారు. 2600 మెగావాట్ల ఈ సూపర్ తర్మల్ విద్యుత్ కేంద్రంలో మొత్తం 7యూనిట్లు(200 మెగావాట్ల 3 యూనిట్లు, 500 మెగావాట్ల 4 యూనిట్లు) విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ప్రస్తుత డిమాండ్‌కు అనుగుణంగా రోజుకు సగటున 50 నుంచి 55 మిలియన్ యూనిట్ల మేరకు ఉత్పత్తి చేస్తున్నది. ప్రస్తుత వేసవిలో విద్యుత్‌ను పొదుతున్న రాష్ట్రాల్లో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంటున్నది. ఈ నేపథ్యంలో మరో రెండు నెలలు ప్రాజెక్టులో అన్ని యూనిట్లలో పూర్తిస్థాయి ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రానున్న వర్షాకాలంలో ప్రాజెక్టులోని కొన్ని యూనిట్లకు దశలవారీగా వార్షిక మరమ్మతులు(ఓవర్‌హాల్) చేసేందుకు సైతం అధికారులు ప్రణాళికలు సిద్ధంచేశారు. కాగా, రామగుండం ప్రాజెక్టుకు అవసరమైన బొగ్గును సమీపంలోని సింగరేణి గనుల నుంచి లింకేజీ మేరకు సరఫరా జరుగుతున్నట్లు తెలుస్తున్నది.

రోజుకు రూ.300 వచ్చేలా కూలీలకు పనులు కేటాయించాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్

సుల్తానాబాద్, ఏప్రిల్ 29: ఉపాధిహామీ పనులకు సంబంధించి కూలీలకు రోజుకు మూడు వందల రూపాయలు గిట్టుబాటు అయ్యేలా పనులు కేటాయించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్ ఉపాధిహామీ పథకం అధికారులకు సూచించారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామంలోని పెద్ద చెరువు వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను జిల్లా పీడీ రవీందర్ రాథోడ్ పర్యవేక్షించారు. మంగళవారం ఆయన గ్రామంలోని పూడిక పనుల వద్ద పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా తలకు పాగా ధరించి రావాలని అన్నారు. పని స్థలాల్లో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. దాహం అయినా కాకపోయినా తరచూ నీరు తాగాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ మల్లీశ్వరి, జేఈ రాజ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంటు శారద, శంకర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

‘పది’ ఫలితాల్లో బాలికలదే పైచేయి

- రాష్ట్ర స్థాయిలో జిల్లాది 8వ స్థానం
- గతంలోకంటే మెరుగైన ఫలితాలు



పెద్దపల్లి కల్చరల్,ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. రాష్ట్రస్థా యిలో పెద్దపల్లి జిల్లా 96.32 శాతంతో ఎనిమిదవ స్థానం లో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా 120 కేంద్రాల్లో 7716 మంది విద్యార్థులు పరీక్షలకు రాయగా, 7432 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా బా లురు 1769 పరీక్షలు రాయగా 1567 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 1893 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా 1839 మంది విద్యార్థినిలు ఉత్తీర్ణులు అ య్యారు. దీనితో బాలికలు 97.45 శాతం ఉత్తీర్ణులు కాగా, బాలురు 95.2 శాతం ఉత్తీర్ణులు అయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం జిల్లా వ్యాప్తంగా ఆరుగురు 10 జీపీఏ సాధించారు. జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల జూలపల్లి ఇద్దరు, టీఎంఎస్ లింగాపూర్ ఇద్దరు, కేజీబీవీ రామగిరి ఒకరు, జడ్పీ హెచ్ఎస్ గర్ల్స్ పెద్దపల్లి ఒకరు 10జీపీఏ సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యా ర్థులను జిల్లా విద్యాధికారి మాధవి, జిల్లా పరీక్షల నిర్వ హణ అధికారి రాంరెడ్డి అభినందించారు. ఇక ప్రైవేటు పాఠశాలలు కూడా తమ సత్తాను చాటుకున్నాయి.

● మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 99 శాతం ఉత్తీర్ణత

పదవ తరగతి ఫలితాలలో జిల్లాలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 99శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 3 మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి 10వ తరగతి పరీక్షలు రాసిన 129 మంది విద్యార్థులలో 128 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, ఒక విద్యార్థి మాత్రమే ఫెయిల్ కాగా, 99శాతం ఉత్తీర్ణత సాధించడంలో కృషిచేసిన ఉపాధ్యాయులు, సంబంధిత సిబ్బందికి, సహకరించిన ఇతర అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

హామీల అమలుపై కాంగ్రెస్‌ను నిలదీస్తున్న జనం

- దొంగ వీడియోలతో బీజేపీని దెబ్బతీసే కుట్ర
- ప్రజా సమస్యలను పట్టించుకోని వినోద్ కుమార్
- 8న ప్రధాని బహిరంగ సభను విజయవంతం చేయాలి
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



వేములవాడలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

వేములవాడ, ఏప్రిల్ 30: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ ప్రజలు నిలదీస్తున్నారని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. పార్ల మెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో పర్యటించ నున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని కోర్టు సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. మోసపూరితమైన ఆరు గ్యారెంటీల కాంగ్రెస్ బండారాన్ని ప్రజలు గమనించారని, ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజల వద్దకు వెళ్తున్న నాయకులను నిలదీస్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీలపై అడిగితే తాను మాట్లాడలేనని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. దొంగ వీడియోలతో బీజేపీ ప్రతిష్టను దెబ్బ తీసే విధంగా కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని, ఓడిపోతామని భయంతో కాంగ్రెస్ ఈ విధంగా నీచానికి దిగజారిందని మండిపడ్డారు. తనపై పోటీ చేస్తే డిపాజిట్లు కూడా రాని పొన్నం ప్రభాకర్ అవాకులు, చెవా కులు పేలడం సిగ్గుచేటని, పొన్నం ప్రభాకర్ వ్యవహార శైలిని చూసి కాంగ్రెస్ నేతలే బెంబేలెత్తిపోతున్నారని విమర్శించారు. మాదిగ సమాజంపై అవాకులు, చెవాకులు పేలుతున్న మానకొండూరు కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఆ పార్టీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీలను కించపరుస్తున్న నేతలను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 8వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వేములవాడకు వస్తున్నారని, వేములవాడలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు చెన్నమనేని వికాస్‌రావు, రాణి రుద్రమ, ఎర్రం మహేశ్, అల్లాడి రమేశ్ పాల్గొన్నారు.

● నా గుండుతో నీకేం పని రేవంతన్న

సిరిసిల్ల రూరల్: 'నేను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల సంగతి ఏమైందని అడిగితే గుండు, అరగుండు అంటూ హేళనగా మాట్లాడుతావా? నా గుండుతో నీకేం పని.. ఐదేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధి, పోరాటాలు నీ కళ్లకు కనిపించడం లేదా రేవంతన్నా' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేం ద్రంలో మంగళవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్ మా ట్లాడారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి వాడుతున్న బాషను చూసి జనం అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. మీరెన్ని డ్రామాలు ఆడినా.. ఎంత హేళన చేసినా జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చే సీట్లు గుండు సున్నాయేనని అన్నారు. జమ్మికుంటలో మంగళవారం జరిగిన సీఎం బహిరంగ సభ జనం లేక అట్టర్ ప్లాఫ్ అయ్యిందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరిస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఎన్నికల్లో ఓడి పోతామనే భయంతో రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, అసభ్య పదజాలంతో తిడుతూ ప్రజల దృష్టిలో చులకన అవుతున్నారని అన్నారు.

జమ్మికుంట సభలో సీఎం చేసిన వ్యాఖ్యలు తనకు బాధకలిగించాయన్నారు. సీఎం హోదాలో ఉంటూ దిగజారి మాట్లాడడం సిగ్గుచేటని, మేధావి వర్గం, సామాన్య ప్రజల్లో సీఎం మాటలపై చర్చ జరుగుతోందని అన్నారు. మే 8న వేములవాడలో జరిగే ప్రధానమంత్రి బహిరంగ సభకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, పార్లమెంటరీ కో కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కారెడ్ల మల్లారెడ్డి, కౌన్సిలర్లు బోల్గం నాగరాజుగౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గత ఎన్నికల్లో ఆశీర్వదించి పార్లమెంటుకు పంపితే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగా.. అమ్మా.. మళ్లీ గెలిపిస్తే అందుబాటులో ఉండి మరింతా సేవ చేస్తా అని కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గంభీరావుపేట మండలంలో జరిగిన రేణుక ఎల్లమ్మ సిద్దోగం వేడుకలకు హాజరై ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ మీదుగా సిరిసిల్లకు వెళుతూ ఆ పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మండల ఇన్‌చార్జి రాజిరెడ్డి, మధు, నాయకులు దేవేందర్‌రెడ్డి, బాపురెడ్డి, గణేశ్, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, బుగ్గారెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.



బొప్పాపూర్‌లో ప్రచారం చేస్తున్న బండి సంజయ్‌కుమార్



వేములవాడలో మోదీ బహిరంగ సభాస్థలాన్ని పరిశీలిస్తున్న బండి సంజయ్

చేసిన అభివృద్ధిని చూసి ఓటేయండి

- కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టులు, చెరువులు ఎండాయి
- హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేందుకు కుట్ర చేస్తున్నారు..
- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 30: కరీంనగర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటేయండని ప్రజలను బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బి వినోద్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు కరీంనగర్‌కు వెయ్యికోట్లతో స్మార్ట్ సిటీ తెచ్చి అభివృద్ధి చేశానన్నారు. రైతుకు పెట్టుబడి ఇచ్చే ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేదని, కేసీఆర్ సర్కార్ మాత్రమే ఇచ్చిందని అన్నారు. రైతులకు నార్లు పోసేటప్పుడు ఇవ్వాల్సిన డబ్బులు వరి కోతల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని మండిపడ్డారు. రైతు బీమా కూడా ఇవ్వడం లేదన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టులు, చెరువులు ఎండాయని, కాంగ్రెస్ అసమర్థతతోనే రాష్ట్రంలో కరువు వచ్చిందని అన్నారు. ఐదుగురు ఎంపీలు గెలిచి 2004లో పార్లమెంట్ లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం కొట్లాడామని గుర్తు చేశారు. ఆంధ్రాలో చంద్రబాబు, తెలంగాణలో రేవంత్‌రెడ్డి కలిసి మళ్లీ తెలంగాణను ఆంధ్రలో కలిపే కుట్ర చేస్తారని అన్నారు. మరో రెండేళ్లలో ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేసే కుట్రలు చేస్తున్నారని, అది జరగనివ్వబోమన్నారు. నదుల అనుసంధానం పేరుతో కేంద్రం కుట్ర రాజకీయాల చేస్తున్నారని, బండి సంజయ్ ఎప్పుడైన తెలంగాణ కోసం పార్లమెంట్‌లో మాట్లాడలేదన్నారు. బండి సంజయ్ ఒక్క గుడి, బడి తేలేదన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో జాతీయ రహదారులు తెచ్చానని అన్నారు. నలుగురు బీజేపీ ఎంపీలు, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీలు గెలిచి ఒక్కసారి కూడా నవోదయ పాఠశాల కోసం మాట్లాడలేదన్నారు. బండి సంజయ్ ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి సమస్యలు చెప్పలేదని విమర్శించారు. కరీంనగర్‌లో 50 కోట్లతో తిరుమల తిరుపతి దేవస్థానం కడుతున్నామన్నారు.

● గులాబీ జెండాతోనే తెలంగాణ అభివృద్ధి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

గులాబీ జెండా ఎంపీలు గెలిస్తేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యేగంగుల కమలాకర్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం పచ్చగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కరెంటు, సాగు, తాగు నీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

వ్యవసాయం కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2023 సార్వత్రిక ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించారని, ఎంపీగా వినోద్‌కుమార్‌ని గెలిపిస్తే అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. మూడునెలల కాంగ్రెస్ పాలనలో కష్టాలు మొదలయ్యాయని, కేసీఆర్ లేని లోటు స్పష్టంగా కనబడుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీలకు ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికే తను ఎమ్మెల్యేగా ఉన్నానని, ఎంపీగా వినోద్ కుమార్ గెలిస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ మండల శాఖ అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, సర్పంచ్ బోగోండ లక్ష్మి ఐలయ్య, రైతు సహకార సంఘం అధ్యక్షుడు తిరుపతి, మాజీ సర్పంచ్‌లు రుద్ర రాము, శ్రీధర్, మారుతి, ఎంపీటీసీలు మారుతి, నాయకులు సుంకిశాల సంపత్‌రావు, జువ్వాడి రాజేశ్వర్ రావు, సర్వర్, నెక్ పాషా, జక్కం నర్సయ్య, మల్లారెడ్డి పాల్గొన్నారు.

● పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల గొంతుకనవుతా..

జమ్మికుంట రూరల్: ప్రజలు ఆదరించి భారీ మెజార్టీతో గెలిపిస్తే పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల గొంతుకను అవుతానని బీఆరెస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వావిలాలలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, గెల్లు శ్రీనివాస్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. గత ఎన్నికల్లో హుజూరాబాద్ నుంచి అత్యధిక ఓట్లు వేశారని, ఈ సారి అంతకన్న ఎక్కువ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఇచ్చిన హామీలు అన్ని నెరవేరుస్తామని ప్రజలను మభ్య పెట్టారని, ఇప్పటి వరకు ఎందుకు నెరవేర్చలేదో ప్రజలకు చెప్పాలన్నారు. బండి సంజయ్‌ను ఎంపీగా గెలిపిస్తే ఏమైన అభివృద్ధి చేశారా ప్రజలు ఆలోచించాలన్నారు. భారీ మెజార్టీతో వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కెడిసిసి వైస్ చైర్మన్ పింగిలి రమేష్, ఎంపిటిసి మర్రి మల్లేషం, తదితరులు పాల్గొన్నారు.



చామనపల్లి సమావేశానికి హాజరైన మహిళలు



వావిలాలలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టం



సివిల్స్ ర్యాంకర్స్ సహన, సాయికిరణ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30: ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టమని, అత్యుత్తమంగా పని చేసి మంచి గుర్తింపు పొందాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన నందాల సాయికిరణ్ సివిల్స్‌లో 27వ ర్యాంకు, విద్యానగర్‌కు చెందిన కొలనుపాక సహన 739 ర్యాంకు సాధించారు. వారు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలువగా వారికి ఆమె అభినందనలు తెలిపారు.

'ఒత్తిడిని జయిస్తేనే ఆరోగ్యం'

గణేశ్‌నగర్,ఏప్రిల్ 30: వృత్తి, ఉద్యోగాల్లో ప్రతి ఒక్కరు శారీరక, మానసిక ఒత్తిడులకు లోనవుతారని, వాటిని జయిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని ప్రముఖ శిక్షకులు, కవి, రచయిత, కాలమిస్ట్, విశ్రాంత ప్రిన్సిపాల్ లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ సమావేశ మందిరంలో విద్యుత్ శాఖ ఎన్‌పీడీసీఎల్ ఓఎస్ఎం స్థాయి ఉద్యోగులకు నిర్వహించిన ఓరియంటేషన్ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకుంటూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణాయుత జీవనశైలి అలవర్చుకోవడం, దినచర్యను పాటించడం, శారీరక వ్యాయామం చేయడం, కార్యాలయంలో సమయపాలన పాటించడం, ఆశావహ ధోరిణి కలిగి ఉండడం లాంటి పలు అంశాలు ఒత్తిడిని తగ్గిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ గంగాధర్, డీఈ టెక్నికల్ విజయేందర్ రెడ్డి, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, ఏడి సాయినేని నరెందర్, అధికారులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించే వారినే గెలిపించాలి

-డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు సుపరిపాలన అందించే నేతలను గెలిపించుకోవాలని తెలంగాణ రాష్ట్ర జనసత్తా వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ముదుగంటి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కిమ్స్ కళాశాలలో తెలంగాణ జనసత్తా ఏర్పాటు చేసిన ఓటర్ల చైతన్య కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడూ జరిగేవేనని, అయితే ఒకప్పటికి ఎన్నికలకు ఇప్పటి ఎన్నికలకు ఎంతో వ్యత్యాసం ఉందని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. ఈ సమావేశంలో కళాశాల వైస్ చైర్మన్ సాకేత్‌రామారావు మాట్లాడగా ప్రిన్సిపాల్ బక్కి అర్జున్‌రెడ్డి, అర్జున్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి'

సుభాష్‌నగర్, ఏప్రిల్ 30: ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో కాని, రాష్ట్రంలో కాని ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలు అణగారిన వర్గాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం జరుగుతుందన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. 2014లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిరుపేదలకు ఇల్లు కట్టిస్తామని చెప్పి రాష్ట్రంలో ఒక్కరికైనా ఇల్లు కట్టించారా అని ప్రశ్నించారు. తాను బీసీని అని చెప్పుకునే ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ళ కాలంలో బీసీ కుల గణన ఎందుకు చేయలేదన్నారు. ఈ సమావేశంలో గోష్కి శంకర్, కోంద్ర సంపత్‌కుమార్, మీసాల సాయిలు, మైసని మనోహర్, ఆవారు లత, కోంద్ర స్వరూప, లింగయ్య, బాపురెడ్డి, రవి, చలిముల నవీన్, కొయ్యడ మనోజ్‌కుమార్, ఎండి రజాక్ పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు వీడ్కోలు



పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానిస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 30: కరీంనగర్ పోలీస్ కమీషనరేట్‌లో ఎస్ఐ మొహమ్మద్ ఆరిఫుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ సారంగధర మంగళవారం పదవి విరమణ పొందారు. కమీషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాలులో వారికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనివార్యమన్నారు. ఎన్నో సవాళ్లతో కూడుకుని వున్న పోలీస్ ఉద్యోగం సంపూర్ణంగా పూర్తి చేసి పదవి విరమణ పొందడం గొప్ప విషయం అన్నారు. పదవీ విరమణ పొందుతున్న అధికారులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న అధికారులకు డీసీపీ పూలమాలవేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, ఆర్ఐ శ్రీధర్ రెడ్డి(వెల్ఫేర్), ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

4న ఎమర్జింగ్ భారత్‌పై సెమినార్



సమావేశంలో మాట్లాడుతున్న రాజభాస్కరరెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 30: నగరంలోని ఆర్‌బీవీఆర్ రెడ్డి పంక్షన్‌హాల్‌లో మే 4వ తేదీన సాయంత్రం 6 గంటలకు ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ భారత్' అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామని ప్రజ్ఞాభారతి చైర్మన్ డాక్టర్ ఎల్ రాజభాస్కరరెడ్డి తెలిపారు. మంగళవారం ఐఎంఏ హాల్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి కాలమిస్ట్, రచయిత, రాజకీయ విశ్లేషకుడు శాంతన్‌గుప్త వస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా శాంతన్‌గుప్త రాసిన '101 కారణాలు' పుస్తకంపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. గత పదేళ్ళలో భారతదేశం ప్రపంచానికి మార్గనిర్దేశనం చేస్తూ విశ్వ గురువుగా ఎదిగి గొప్ప శక్తిని సంతరించుకుందని అన్నారు. దేశీయంగా, విదేశీయంగా అభివృద్ధిలో దూసుకపోతోందని తెలిపారు. దీనికి కారణం దేశం బలమైన నాయకత్వం చేతిలో ఉండడమేనన్నారు. సమావేశంలో మరిన్ని ఆసక్తికర అంశాలను తెలుసుకునేందుకు అందరూ పాల్గొనాలని కోరారు. ప్రధాన కార్యదర్శి మందల నగేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విభాగ్ కార్యవాహ్ పాక సత్యనారాయణ, డాక్టర్ భాగ్యరెడ్డి, గాజుల రవీందర్, దేశిని శ్రీనివాస్, వెచ్చ మురళి, వాసుదేవరెడ్డి, మధుసూదన్‌రావు, కడారు అనంతరెడ్డి, వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ అభ్యర్థిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తాం'

భగత్‌నగర్, ఏప్రిల్ 30: అఫిడవిట్‌లో తప్పుడు సమాచారమిచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి, అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, గంద్ర నళిని అన్నారు. మంగళవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి ఎన్నికల సంఘానికి తప్పుడు సమాచారమిచ్చారన్నారు. తనదికాని భూమిని తనదిగా అఫిడవిట్‌లో పేర్కొన్నారన్నారు. ఆస్తుల వివరాలు కూడా పూర్తిగా పేర్కొనలేదన్నారు. వినోద్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘానికిఫిర్యాదు చేస్తామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆవేశం ఎక్కువ, ఆలోచన తక్కువ అన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయక పోయినా చేసినట్లు అబద్ధాలు ఆడుతున్నారన్నారు. గారడీ మాటలతో ప్రజలను మోసం చేయాలనుకుంటున్నారని విమర్శించారు. అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ నేతలే అంబేద్కర్ సాక్షిగా ఆరు గ్యారెంటీలపై అబద్ధాలు ఆడడుతున్నారాన్నారు. రిజర్వేషన్ల రద్దు పేరుతో అబద్ధాలు ఆడుతూ కులాలు, మతాల మధ్యచిచ్చు పెడుతున్నారన్నారు. పవిత్రమైన అయోధ్య అక్షింతలు, దేవుడి తీర్థ ప్రసాదాలను సైతం కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చులకన చేయడం సిగ్గుచేటన్నారు. శ్రీరాముడి పేరు వింటేనే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు భయపడుతున్నారన్నారు. ధర్మ రక్షణ కోసం పోరాడుతున్న బండి సంజయ్‌ను విమర్శించే నైతికఅర్హత కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు లేదన్నారు. గ్యాస్ సబ్సిడి రాకపోతే తహసీల్దార్ ఆఫీస్‌కు పోయి ఫిర్యాదు చేయాలని ఎన్నికల సమయంలో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

'కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలి'

భగత్‌నగర్, ఏప్రిల్ 30: సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి బీజేపీరాష్ట్ర నాయకుడు కొట్టె మురళీకృష్ణ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కొట్టె మురళీకృష్ణ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అసత్యాల ప్రచార సూత్రధారి రాహుల్‌గాంధీ అయితే కుట్రదారు సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాసామ్య పద్ధతిలో పోరాడలేక అక్రమ పద్ధతులు అవలంబిస్తున్నారన్నారు. రిజర్వేషన్ల అంశంపై బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ మాట్లాడిన విషయాన్ని తప్పుగా ప్రచారం చేస్తూ మార్ఫింగ్ వీడియో, ఆడియోలను ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను విమర్శించినట్లు రిజర్వేషన్ల అంశంపై తప్పుగా మాట్లాడినట్లు ఫేక్ ఆడియో వీడియో కాల్ రికార్డులను క్రియేట్ చేసి సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ చేస్తున్నారన్నారు. దీనివల్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పరువు ప్రతిష్టకు పార్టీకితీవ్ర నష్టం కలిగించేలా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిపై ఎన్నికల నియామవళి ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

'జన జాతర'కు పోటెత్తిన జనం



సమావేశానికి ట్రాక్టర్‌లో వస్తున్న మహిళలు

జమ్మికుంట/జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 30: జమ్మికుంటలో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎండ దండి కొట్టినా ప్రజలు తమకు కేటాయించిన వాహనాల్లో వచ్చి సభను విజయవంతం చేశారు. సభలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిన ప్రకారం ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలు అమలు చేసిందని, ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోని వస్తుందని, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జి కేకేమహేందర్‌రెడ్డి, దాసరి భూమయ్య, మిల్కూరి వాసుదేవరెడ్డి, మర్రి వెంకటస్వామి, తుమ్మేటి సమ్మిరెడ్డి, పత్తి కృష్ణారెడ్డి, దేశిని కోటి, సాయిని రవి, పూదరి రేణుక శివకుమార్, పొనగంటి మల్లయ్య, మొలుగూరి సదయ్య, దొంత రమేష్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో కార్యకర్తల ఉత్సాహం

'పోలింగ్ సజావుగా నిర్వహించాలి'

సుభాష్‌నగర్, ఏప్రిల్ 30: ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ సజావుగా నిర్వహించాలని బీఆర్ఎస్ ఎన్నికల ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్ల వద్ద తాగునీరు, టెంట్ ప్రత్యేక వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ పోలింగ్ జరిగేలా తగిన ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. 85 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధుల కోసం ఇంటివద్ద ఓటు వేసేలా హోమ్ ఓటింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు తగిన ఏర్పాటు చేయాలని కోరారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు జరగకుండా పోలింగ్ సజావుగా నిర్వహించాలని కోరారు.

ప్రజ్ఞ వేసవి శిక్షణా శిబిరానికి ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 30: వికాస తరంగిణి, జెట్ ఆధ్వర్యంలో మే 3 నుంచి 18వ తేదీ వరకు సప్తగిరికాలని కోదండ రామాలయంలో ప్రజ్ఞ వేసవి శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. 8 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలు శిక్షణకు అర్హులని, శిక్షణలో శ్లోకాలు, కీర్తనలు, భజనలు, నైతిక కథలు, యోగ, ధ్యానం, పండుగల విశిష్ఠత, రామాయణ, భారత, భాగవతాల్లోని కొన్ని అంశాలు, ఋషుల చరిత్రలు, ఆటలు నేర్పుతారని తెలిపారు. పేర్లను ఆలయంలో నమోదు చేసుకోవాలని, మిగతా వివరాలకు 9440086086, 9866111100 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సమాజానికి దిక్సూచి శ్రీశ్రీ సాహిత్యం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 30: శ్రమైక జీవన సౌందర్యాన్ని గుర్తించి శ్రమ జీవుల పక్షాన నిలిచి కలాన్ని ఖడ్గంగా మలచిన శ్రీశ్రీ సాహిత్యం సమాజానికి దిక్సూచి అని తెలంగాణ సాహితి రాష్ట్ర కార్యదర్శి మాగుడుల రాములు అన్నారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీశ్రీ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజం పది తరతరాల పాటు సామరస్యంగా జీవించాలంటే శ్రీశ్రీ సాహిత్యం అవసరమని అన్నారు. సమాజంలో హెచ్చు తగ్గులున్నంత కాలం శ్రీశ్రీ సాహిత్యం పట్ల రోజురోజుకి ఆదరణ పెరుగుతుందని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మానువాడ శంకర్, గౌరవాధ్యక్షుడు ఆడెపు రాంనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సతీశ్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఐదేళ్ల జైలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 30: వ్యక్తిపై దాడి చేయడంతో మృతికి కారణమైన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన రంగు నాగరాజుకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ఎన్. ప్రేమలత తీర్పు ఇచ్చారని స్థానిక ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండలంలోని గొల్లపల్లిలో బొమ్మెర అంజయ్య ఇంటి వద్ద 27 జూలై 2020న రంగు నాగరాజుకు చెందిన కుక్క మూత్ర విసర్జన చేసింది. దీంతో అంజయ్య అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆగ్రహించిన నాగరాజు దాడి చేశాడు. దీంతో అంజయ్య స్పృహ కోల్పోయాడు. అతడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. మృతుడి కొడుకు భీంచంద్ ఫిర్యాదుతో అప్పటి ఎస్సై వెంకటకృష్ణ కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ బన్సీలాల్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. పీపీ నర్సింగారావు వాదనలు వినిపించగా సీఎంఎస్‌లు శ్రీకాంత్, రవీంద్రనాయుడు ఆధ్వర్యంలోని కోర్టు కానిస్టేబుళ్లు శ్రీనివాస్, నరేందర్ 13 మంది సాక్షులను ప్రవేశ పెట్టారు. న్యాయమూర్తి ప్రేమలత పూర్వ పరాలను పరిశీలించారు. నేరం రుజువు కావడంతో రంగు నాగరాజుకు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధించారని ఎస్సై వివరించారు.

ఎస్సెస్సీలో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

● 135 మంది విద్యార్థులకు 10 జీపీఏ


విద్యార్థులతో కలిసి విజయసంకేతం చూపుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30: ఎస్సెస్సీలో అత్యుత్తమ బోధనతో అగ్రశ్రేణి ఫలితాలను సాధిస్తున్నామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ట్రినిటాట్స్ ప్రాంగణంలో 10వ తరగతి ఫలితాల్లో 10 జీపీఏలతో పాటు అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల ఏర్పాటు చేసిన విజయోత్సవ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన 135 మంది విద్యార్థులు 10 జీపీఏలను సాధించారన్నారు. 139 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 113 మంది విద్యార్థులు 9.7 జీపీఏలను సాధించారని అన్నారు. 1140 మంది విద్యార్థులకు గాను 747 మంది విద్యార్థులు 9జీపీఏ ఆపై మార్కులు సాధించడం విశేషమన్నారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్, ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ మార్కులను, వివిధ విభాగాల్లో ప్రశంసనీయ జాతీయ స్థాయి ర్యాంకులను సాధించామని అన్నారు. ప్రోత్సాహాన్ని అందిస్తున్న తల్లిదండ్రులకు, విజయపరంపరకు అహర్నిశలు కృషిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందికి నరేందర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

పది ఫలితాల్లో 'ట్రినిటి' విజయభేరి

● 10 జీపీఏ సాధించిన 29 మంది విద్యార్థులు


ట్రినిటి విద్యార్థులను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో పెద్దపల్లి జిల్లాలో ట్రినిటి ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో కంటే ఉత్తమ ఫలితాలను తమ విద్యార్థులు సాధించారని విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి నటువంటి విద్యార్థులను అభినందించి వారికి పుష్పగుచ్ఛాలు అందించారు. 29 మంది 10 జీపీఏ, 24 మంది 9.8 జీపీఏ, 40 మంది 9.7 జీపీఏ, 28 మంది 9.5 జీపీఏ, 29 మంది 9.3 జీపీఏ, 28 మంది 9.2 జీపీఏ, 20 మంది 9 జీపీఏ, మరో 243 మంది విద్యార్థులు 9 జీపీఏలోపు తర్వాత సాధించి ప్రతిభను కనబరిచారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్‌ఎంలు, ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి


ముత్తయ్య(ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 30: సిరిసిల్ల పట్టణంలోని సర్ధాపూర్ గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనానికి ఢీకొనడంతో ముస్తాబాద్ మండలంలోని ఆవునూరుకు చెందిన బత్తుల ముత్తయ్య(56) మృతిచెందాడు. సోమవారం రాత్రి కామారెడ్డి నుంచి కరీంనగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముస్తాబాద్ మండలంలోని ఆవునూరులో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళ్లి వస్తున్న ఆవునూరుకు చెందిన బత్తుల మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య పుష్పలత పదేళ్లుగా పక్షవాతంతో బాధపడుతోంది. ఓ వైపు తల్లి అనారోగ్యం, మరో వైపు తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ ఇంట్లో విషాదం అలుముకుంది. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ సంఘటనపై కుమారుడు నగేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

● రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు..


గాయాలపాలైన తాళ్ల శంకర్

మల్లాపూర్, ఏప్రిల్, 30 : మండలంలోని కొత్తధాంరాజుపల్లి గ్రామంలో జరిగిన రోడ్డ ప్రమాదంలో తాళ్ల శంకర్(68) అను వృద్ధుడు మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలో తాళ్ల శంకర్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి ఇద్దరు యువకులు తమ ద్విచక్ర వాహనంతో ఢీకొట్టారు. దీంతో శంకర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చెస్తున్నట్లు తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

ఎలిగేడు, ఏప్రిల్ 30: మండలంలోని లోకపేటకు చెందిన ముత్కల వెంకటేశ్వర్లు (42) బోయ రెండేళ్ల నుంచి షుగర్, బీపీ సంబంధిత వ్యాధులతో బాధపడుతూ జీవి తంపై విరక్తిచెంది ఈనెల 17న మధ్యాహ్నం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు.హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఆయన భార్య శైలజ ఫిర్యాదు మేరకు జూలపల్లి ఎస్సై శ్రీధర్ కేసునమోదు చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం వ్యాన్

● యువకుడికి తీవ్ర గాయాలు



బైక్ ఢీకొట్టిన డీసీఎం

కథలాపూర్, ఏప్రిల్ 30 : మండలంలోని భూషణరావుపేటలో ఎదురెదురుగా వస్తున్న బైక్‌ను డీసీఎం ఢీకొట్టిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లికి చెందిన అరవింద్ అనే వ్యక్తి బైక్‌పై కోనాపూర్ వెళ్తున్నాడు. మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ నుంచి వస్తున్న ఏపీ 15 వై 6107 నంబర్ గల డీసీఎం వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్ పూర్తిగా దెబ్బతినగా అరవింద్‌కు కాలువిరిగింది. కుటుంబ సభ్యులు నిజామాబాద్‌కు చికిత్స నిమిత్తం క్షతగాత్రున్ని తరలించారని తెలిపారు. గాయపడ్డ వ్యక్తి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పిచ్చి కుక్క దాడిలో గాయాలు

ధర్మపురి, ఏప్రిల్ 30: ధర్మపురి మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో పలువురు వ్యక్తులు, పశువులు, మేకలపై మంగళవారం పిచ్చి కుక్క దాడి చేసింది. రాత్రి 11 గంటల సమయం నుంచి తెల్లవారు జామును 3 వరకు పిచ్చి కుక్క దాడి చేసి కరిచింది. ఈ దాడిలో ఉల్లెందుల లింగవ్వ, మంతుర్తి మల్లయ్య, బండారి నారాయణ, జక్కుల రాజవ్వ, గడిసందుల గంగవ్వతో పాటు పన్నెండు పశువులు, మేకలను కరిచి తీవ్రంగా గాయపరిచింది. దీంతో భయాందోళనలు చెందిన గ్రామస్తులు కొందరు పరుగులు తీశారు. కుక్కను పట్టుకోవటం కోసం గ్రామంలో ఒక టీమ్ తిరుగుతుండగా దొరకలేదు. గాయపడిన వారందరిని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం పంపించారు.

పోలీస్ స్టేషన్ నుంచి నిందితుడి పరార్

చందుర్తి ఏప్రిల్ 30 : గంజాయి సరఫరాలో ఓ నిండితుడిని చందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తుండగా సోమవారం అర్ధరాత్రి వారి కళ్లుగప్పి పరారయ్యాడు. గంగాధర మండలం గర్శకుర్తికి చెందిన ఓ వ్యక్తి గంజాయి సరఫరా చేస్తుండగా మర్రిగడ్డలో ఏప్రిల్ 29న పోలీసు పట్టుకున్నారు. 29న అర్ధరాత్రి బాత్ రూం వెళ్లి వస్తానని చెప్పి పోలీసుల కళ్లు కప్పి గోడదూకి పరారయ్యాడు. తిరిగి రాకపోవడంతో ఠాణలో ఉన్న పోలీసులు అతడి కోసం అన్ని చోట్ల వెతికారు. అప్పటికే పోలీస్ స్టేషన్ ఆవరణ నుంచి బయటకు వెళ్లిపోయాడు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు పోలీసులు తెలిపారు.

ఇల్లు ధ్వంసం చేసిన వ్యక్తులపై కేసు

జూలపల్లి, ఏప్రిల్ 30 : మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన పుల్లూరి ప్రదిప్‌కుమార్‌కు చెందిన ఇల్లును ధ్వంసం చేసిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. పుల్లూరి ప్రదీప్‌కుమార్‌కు వారసత్వంగా సంక్రమించిన పాత ఇల్లు, ఖాళీ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించిన పుల్లూరి రాజేశ్వర్‌రావు, పుల్లూరి శ్రీనివాస్‌రావు, పుల్లూరి సంకీర్తు, నమిలికొండ ఆగయ్య, నమిలికొండ కోటేష్‌లు జేసీబీ సహాయంతో ఈనెల 27న ఇల్లును ధ్వంసం చేశారు. ప్రదీప్‌కుమార్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక డంపును సీజ్ చేసిన అధికారులు

మంథని, ఏప్రిల్ 30: మండలంలోని అంగుళూరు శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద అక్రమంగా డంప్ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు మంథని ఆర్ఐ రాజిరెడ్డి మంగళవారం తెలిపారు. మంథని పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఆప్రాంతంలో తనిఖీ చేయగా గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా నిల్వ చేసిన 20 ట్రాక్టర్ల ఇసును గుర్తించామన్నారు. దీన్ని సీజ్ చేసిన రక్షణ నిమిత్తం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోకి తరలించినట్లు తెలిపారు.

పోతారంలో దొంగతనం

మల్యాల, ఏప్రిల్ 30: మండలంలోని పోతారంలో సోమవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన ఎలుకొండ చిన్నగంగారం, కుటుంబసభ్యులు సోమవారం జగిత్యాల వెళ్లగా రాత్రి రూ.50వేల నగదు, రెండు తులాల బంగారం, 20 తులాల వెండి చోరీకి గురయ్యాయి. మంగళవారం చిన్నగంగారం, కుటుంబసభ్యులు వచ్చి చూసే వరకు దొంగతనం జరిగి ఉండడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై అబ్దుల్‌రహీం సంఘటన స్థలం పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంతో పరిసరాలు గాలించారు. బాదితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పది ఫలితాల్లో 'పారమిత' విద్యార్థుల జయకేతనం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో పారమిత పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనరబరిచారు. 210 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 24 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. 20 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 37 శాతం మంది విద్యార్థులు 9.5 ఆపైన జీపీఏ, 61 శాతం మంది విద్యార్థులు 9జీపీఏ ఆపై, 85శాతం విద్యార్థులు 8జీపీఏ సాధించారు. ఈసందర్భంగా విద్యాసంస్థల అధినేత ప్రసాదరావు మాట్లాడుతూ క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధంగా విద్యనందించడంతో పాటు నైపుణ్యాలకు పెద్దపీట వేసి ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని తట్టుకునే విధంగా విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామని అన్నారు. ఈసందర్భంగా మెరిట్ విద్యార్థులను పాఠశాల అధినేత ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత ప్రసాద్, రాకేష్, ప్రాచీ.వినోద్ రావు, వీయుఎం ప్రసాదరావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్ ఉపాధ్యాయ బృందం అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న పారమిత విద్యాసంస్థల అధినేత ప్రసాదరావు

'సిద్ధార్థ' విద్యార్థుల విజయ ప్రభంజనం


10జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న సిద్ధార్థ అకడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి

కరీంనగర్ టౌన్, మే10: ఎస్సెస్సీలో మంకమ్మతోట, భగత్ నగర్ లోని సిద్ధార్థ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. 32 మంది విద్యార్థులు 10 జీపీఏ, 21 మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించగా 176 మంది విద్యార్థుల 9ఆపై జీపీఏ సాధించారని పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. భగత్ నగర్ క్యాంపస్‌లో 101 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 19 మంది 10జీపీఏ, ఆరుగురు 9.8 జీపీలు, 67 మంది విద్యార్థులు 9 ఆపైజీపీఏ సాధించారని అన్నారు. మంకమ్మతోట క్యాంపస్‌లో 206మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 13 మంది విద్యార్థులు 10 జీపీఏ, 15 మంది విద్యార్థులు 9.8, 109 మంది విద్యార్థులు 9జీపీఏ ఆపై పాయింట్లు సాధించారని అన్నారు. 99శాతం ఉత్తీర్ణతతో విజయ ప్రభంజనం సృష్టించారని అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

లారెల్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న లారెల్ ప్రిన్సిపాల్ బి.మంజులారావు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30: పదవ తరగతి ఫలితాల్లో కరీంనగర్ లారెల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ బి.వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ బి.మంజులా రావు తెలిపారు. పది మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించగా, మరో 10 మంది విద్యార్థులు 9.8 .జీపీఏ, 41 మంది విద్యార్థులు 9 జీపీఏ ఆపై సాధించడం సంతోషం కలిగించిందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరస్పాండెంట్ వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ బి మంజులారావు విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించి, తోడ్పాటునందించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

'పది' ఫలితాల్లో మానేరు విద్యార్థుల విజయదుందుభి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 30: పదో తరగతి ఫలితాల్లో నగరంలోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఏడుగురు విద్యార్థులు అయిజా రెహనాజ్, బింగి సన్నిత, వహీదున్నీస్సా, బి.అక్షయ, జె.జాహ్నవి, ఎన్.అక్షయ, కె.దీపాన్వితలు 10జీపీఏ సాధించారు. మరో 11 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 12 మంది విద్యార్థులు 9.7 జీపీఏ, 15 మంది విద్యార్థులు 9.5 జీపీఏ, 66 మంది విద్యార్థులు 9 ఆపై జీపీఏ సాధించారని పాఠశాల అధినేత కడారి అనంతరెడ్డి తెలిపారు. మానేరు విద్యార్థులందరూ 100శాతం ఉత్తీర్ణత సాధించడం హర్షణీయమన్నారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు కడారి సునీతారెడ్డి, కడారి కృష్ణారెడ్డి, కడారి శ్వేతారెడ్డి అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి

పరస్పర దాడులు.. ఐదుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 30: ఆస్తి పంపకంలో ఇరు వర్గాల మధ్య నెలకొన్న వివాదంలో పరస్పరం దాడులు చేసుకున్న సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామానికి చెందిన ఎగదండి రాజు, ఎగదండి సాయిప్రసన్న, ఎగదండి నర్సింలు, ఎగదండి సుజాత, ఎగదండి పద్మపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. గ్రామంలోని రాజు, నర్సింలు తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తి విషయంలో కొంత కాలంగా అన్నదమ్ముల మధ్య గొడవలు జరుతున్నాయన్నారు. ఇరు కుటుంబాలు పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశామన్నారు. గత నెల 29న ఇరు వర్గాలు రోడ్డుపై దాడులు చేసుకోవడంతో పాటు చుట్టు పక్కల ఉన్న వారిని ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు. వీపీవో సతీష్ ఫిర్యాదుతో ఐదుగురిపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

జగిత్యాలలో షార్ట్‌సర్క్యూట్

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 30: జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో అన్నపూర్ణ బాలికల హాస్టల్‌లో మంగళవారం ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పింది.

ప్రజాస్వామ్య బలోపేతానికి కాంగ్రెస్‌ను గెలిపించాలి

● టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం


చర్చా వేదికలో మాట్లాడుతున్న కోదండరామ్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 30 : ప్రజాస్వామ్య బలోపేతానికి బీజేపీని ఓడించి కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. స్థానిక ఆర్కే. గార్డెన్లో పీపుల్స్ వాయిస్ ఆధ్వర్యంలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం అంశంపై మంగళవారం నిర్వహించిన చర్చ వేదికలో కోదండరాం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో పదేళ్ల మోదీ పాలనలో అసమానతలు పెరిగాయని, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ, దర్యాప్తు సంస్థలను ఉపయోగించి రాజకీయ నేతలను లొంగదీసుకుంటున్నారని విమర్శించారు. మోదీ పాలనలో దేశంలో 162మంది మిలియనీర్లు 25 శాతం జాతీయ ఆదాయాన్ని, 40 శాతం సంపదను అనుభవిస్తున్నారన్నారు. దేశంలో 70కోట్ల మంది ప్రజలు కేవలం ఆరున్నర శాతం ఆదాయంతో, 15శాతం సంపద మాత్రమే అనుభవిస్తున్నారన్నారు. ఛత్తీసఘడ్ సరిహద్దుల్లో పారామిలిటరీ దళాలను ఉపయోగించి సరిహద్దు యుద్ధంగా మార్చడం దేశ సమగ్రతకు పెను ముప్పుగా తయారవుతుందన్నారు. సెమినార్‌లో జర్నలిస్టు మునీర్, కోట శ్రీనివాస్‌గౌడ్, తాండ్ర సదానందం, డొంకెన రవీందర్, తాడూరి శ్రీమాన్, ఎరుకల రాజన్న, భూర్ల ధనుంజయ్, జీవన్ రాజు, దేవ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో రంగారెడ్డి జట్టు విజయం

● రన్నరప్‌గా ఆదిలాబాద్

● బహుమతులను అందజేసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


విజేత రంగారెడ్డి జట్టుకు ట్రోఫి అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, ఏప్రిల్ 30: ఓటమి గెలుపునకు నాంది అని, ఓటమి స్ఫూర్తితో క్రీడాకారులు పట్టుదలతో గెలుపు కోసం కృషి చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఇంటర్ సీనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మంగళవారం రాత్రి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శరీర దారుఢ్యం పెరుగుతుందని,

● విజేతగా నిలిచిన రంగారెడ్డి

నాలుగు రోజులుగా గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఉత్సాహం జరిగింది. ఫైనల్‌లో రంగారెడ్డి, ఆదిలాబాద్ జట్లు తలపడగా 3-0గోల్స్‌తో రంగారెడ్డి జట్టు విజయం సాధించగా రన్నరప్‌గా ఆదిలాబాద్ జట్టు నిలిచింది. తృతీయబహుమతి జాయింట్‌గా కరీంనగర్, వనపర్తి జట్లు అందుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ స్టేట్ అధ్యక్షుడు పాల్‌గుణ, కోశాధికారి సిల్వర్, కరీంనగర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గణపతి, ఉపాధ్యక్షులు నాయుడు, కోశాధికారి సామల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ విజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్ పాల్గొన్నారు.

వేములవాడలో వృద్ధుడి దారుణ హత్య


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ

వేములవాడ టౌన్, ఏప్రిల్ 30: వ్యవసాయ క్షేత్రంలో కూలీగా పని చేస్తున్న వృద్ధుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన వేములవాడ పట్టణ శివారులో మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణానికి చెందిన బండ మల్లేశం వ్యవసాయ క్షేత్రంలో జూలపల్లి మండలం తేలుకుంట గ్రామానికి చెందిన మర్రిపల్లి రాజయ్య (64) కూలీగా పని చేస్తూ అక్కడే షెడ్డులో కొంత కాలంగా ఉంటున్నాడు. సోమవారం రాత్రి మద్యం తాగిన రాజయ్య తలపై గుర్తు తెలియని వ్యక్తి పారతో కొట్టడంతో మంగళవారం తెల్లవారు జామున విగతజీవిగా కనిపించాడు. వెంటనే గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ నాగేంద్రచారీ, టౌన్ సీఐ వీరప్రసాద్‌తో పాటు ఎస్సైలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రాజయ్యతో పాటుగా మరో వ్యక్తి కూలీ పని చేస్తూ షెడ్డులోనే ఉంటున్నారని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఆ కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడి భార్య గతంలో అనారోగ్యంతో మృతి చెందగా కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తెలిపారు.

మద్యం మత్తులో హత్య.. ఇద్దరు అరెస్ట్..

మల్యాల, ఏప్రిల్ 30: మద్యం తాగేచోట ఏర్పడిన వివాదం ఓ యువకుడి హత్యకు దారి తీసింది. హత్య విషయం బయటకు పొక్కకూడదని సదరు యువకుడిని దహనం చేశారు. ఈ ఘటనకు కారణమైన ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు మల్యాల సీఐ నీలం రవి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం రామన్నపేటకు చెందిన ముస్కు మహిపాల్‌రెడ్డి(35), అతని మిత్రుడు జగిత్యాల మహాలక్ష్మీనగర్ కు చెందిన రాంపల్లి మహేందర్‌తో పాటు గొల్లపల్లి మండలం ఇబ్రాజ్ పల్లికి చెందిన సిద్దిభియా ఏప్రిల్ 22న జగిత్యాలలోని బార్‌లో మద్యం సేవించారు. అక్కడి నుంచి రాజారం శివారులో గల ఎస్సారెస్పీ కెనాల్ లింక్ గేట్ వద్దకు వెళ్లి మద్యం తీసుకున్నారు. ఈ క్రమంలో మహిపాల్‌రెడ్డి మద్యం మత్తులో సిద్దిభియాను దూషించాడు. దీంతో దీంతో మహేంధర్, సిద్దిభియా ఆవేశంతో దాడి చేయడంతో మహిపాల్‌రెడ్డి కింద పడిపోయాడు. మృతి చెందాడని నిర్ధారించుకొని విషయం బయటకు రాకుండా ఉండేందుకు కాల్చేస్తే తమకు సంబంధించిన ఆనవాళ్లు దొకరవనే ఉద్దేశ్యంతో ఆటోలో గల దుప్పటి, అరటిపళ్ల డబ్బాను మృతుడి పొట్టపై పెట్టి లైటర్‌తో నిప్పంటించారు. తరువాత మహిపాల్‌రెడ్డి ఫోన్ తీసుకొని కరీంనగర్ పారిపోయారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి హైదరాబాద్ వెళ్లడానికి డబ్బుల కోసం తమ ఇంటికి జగిత్యాల వస్తుండగా కొండగట్టు వద్ద వాహనాల తనఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద మొబైల్ ఫోన్లు, లైటర్, ఆటో స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవి తెలిపారు. మహేంధర్‌పై మేడిపల్లి, జగిత్యాల టౌన్, మల్యాల పోలీస్ స్టేషన్‌లలో అయిదు దొంగతనం కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. హత్య కేసును చేధించిన ఎస్సై అబ్దుల్ రహీం పోలీసులు సీఐ ఈ సందర్భంగా అభిందించారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ బోనాల జాతర

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 30 : మండలంలోని జగ్గసాగర్, పెద్దాపూర్ గ్రామాల్లో రేణుక ఎల్లమ్మ బోనాల జాతరను గీత కార్మికులు, గౌడ కులస్థులు ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని ఆలయంలో అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలను నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. జగ్గసాగర్ గ్రామంలోని జాతర కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో తయారు చేసిన బోనాలను నెత్తిన ఎత్తుకొని పోతురాజుల నృత్యలతో డప్పుచప్పుల్ల మధ్య ఊరేగింపుగా రేణుక ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. భక్తులు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో పాల్గొన్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా గీత కార్మికులు ఉత్సవ ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికులు, గౌడ కులస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి చోరీ చేసిన నిందితుల అరెస్టు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 30 : పోలీస్ స్టేషన్ నుంచే పట్టుకున్న గంజాయిని చోరీ చేసిన ఐదుగురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రఘచందర్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సారంగపూర్ మండలం రంగపేటకు చెందిన ఇద్దరు మైనర్లతో పాటు అల్లెపు యశ్వంత్, ధర్మారపు అశోక్, అన్నవేని గంగాధర్ మంచి స్నేహితులు. గంజాయికి అలవాటు పడగా యశ్వంత్, అశోక్‌లపై ధర్మపురి ఎక్సైజ్ అధికారులు గంజాయి కేసు నమోదు చేసి జైలుకు పంపారు. జైలులో ఉండగా సారంగపూర్ పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన 60 కిలోల గంజాయి ఉన్నట్లు తెలుసుకున్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనంలో ఉన్న గంజాయిని దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరు మైనర్లతో కలిసి యశ్వంత్, అశోక్, గంగాధర్ గత నెల 30న రాత్రి సారంగపూర్ పోలీస్ స్టేషన్ వెనుక నుంచి గోడ దూకి వాహనంలో ఉన్న 60 కిలోల గంజాయి సంచులను చోరి చేశారు. చోరీ చేసిన గంజాయిని కొంత మేర ఐదుగురు కలిసి సేవించి మిగతా గంజాయిని రంగపేట గ్రామానికి చెందిన బోదాసు రాకేష్, మాలేపు రణధీర్, మరొక మైనర్‌కు విక్రయించారు. మంగళవారం సారంగాపూర్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో పోలీసులకు గంజాయిని పట్టుబడింది. పోలీసుల విచారణలో పట్టుబడ్డ గంజాయి సారంగపూర్ స్టేషన్ నుంచి చోరీ చేసినట్లు గుర్తించారు. పట్టుబడ్డ ఎనిమిది మందిలో ముగ్గురు మైనర్లు కాగా ఐదుగురిని అరెస్టు చూపించి వారి వద్ద 41 కిలోల గంజాయి, నాలుగు బైక్‌లు, ఒక సెల్ ఫోన్‌ను సీజ్ చేశారు. ఈ సమావేశంలో జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, సారంగాపూర్ ఎస్సై గౌతం పవార్, హెడ్ కానిస్టేబుల్ శ్రీను, కానిస్టేబుల్లు రవి, శ్యాం ఉన్నారు.

'బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పులను గెలిపించండి'

ఎలిగేడు, ఏప్రిల్ 30: మండలంలోని రాములపల్లిలో బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ బలపరుస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీలు పని వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 30: మండలంలోని కాల్వ శ్రీరాంపూర్, మొట్లపెల్లి, కిష్టంపేట, తారుపెల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఉపాధి హామీ కూలీల వద్ద ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకి ఓటు వేయాలని కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సారయ్యా గౌడ్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు సదయ్య పాల్గొన్నారు.

●యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 30: కాలనీలోని 16వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి చక్రపాణి, డివిజన్ అధ్యక్షుడు రాజిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 30: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం మండలంలోని కనగర్తి, కాపులపల్లి, కుర్మపల్లి, బ్రాహ్మణపల్లి, బోంపల్లి, మేరపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉపాధి కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి పాల్గొన్నారు.

బీజేపీని గద్దె దించాలి

ఓదెల, ఏప్రిల్ 30 : మతాన్ని ముందు పెట్టి ఎన్నికల్లో లబ్ధి పొందాలనుకుంటున్న బీజేపీని ఓడించాలని సీపీఐ మండల కార్యదర్శి కోడం స్వామి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించుకోవాలని కోరారు.

నియామకం

అంతర్గాం, ఏప్రిల్ 30: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జిగా రాముగుండంకు చెందిన జిల్లా ఫిషరీస్ చైర్మన్ పల్లికొండ శ్యామ్ నియామకం అయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

బీఆర్‌ఎస్‌కు కార్పొరేటర్ గుడ్‌బై

కోల్‌సిటీ, ఏప్రిల్ 30: రామగుండం కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ అడ్డాల స్వరూపరామస్వామి మంగళవారం రాజీనామానా చేశారు. తన రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షుడు చందర్‌కు పంపినట్టు తెలిపారు.

మాజీ జడ్పీటీసీ దంపతులు బీజేపీలో చేరిక

సుల్తానాబాద్, ఏప్రిల్ 29: సుల్తానాబాద్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ దంపతులు గుర్రాల మల్లేశం లావణ్యలు బీజేపీ లో చేరారు. ఈ మేరకు వారు మంగళవారం కరీంనగర్‌లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సమక్షంలో కాషాయ కండువాలు కప్పుకున్నారు.

అధికారం కోసం అబద్ధపు హామీలు

రామగిరి, ఏప్రిల్ 30: అధికారం కోసం అబద్ధాల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటిస్తుందని జెడ్పీ చైర్మన్ పుట్టమధు అన్నారు. మంగళవారం మండలంలోని రామయ్యపల్లి(బుధవారంపేట్) గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

'ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాం'

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 30: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. మంగళవారం రామగుండం కార్పొరేషన్‌లోని 26, 27, 38, 40, 47 డివిజన్‌లలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు.

●అంతర్గాం, ఏప్రిల్ 30: త్వరలో కేంద్రంలో ఏర్పాటు కానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లిలో పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకి మద్దతుగా ప్రచారం నిర్వహించి ఈ మేరకు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బందారపు బుగ్గరాములుగౌడ్, ఎస్‌కే ఇష్తాకార్ అహ్మద్, మాజీ సర్పంచ్ మేకల సరస్వతి మైసయ్య పాల్గొన్నారు.

కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయండి

గోదావరిఖని, ఏప్రిల్ 30: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కార్నర్ సమావేశం ఈనెల 3న ఉంటుందని, ఈ సమావేశానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. మంగళవారం గోదావరిఖని చౌరస్తాలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

'పది' ఫలితాల్లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు



పది జీపీఏలు సాధించిన విద్యార్థులతో అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్

పెద్దపల్లి కల్చరల్,ఏప్రిల్ 30 : పెద్దపల్లి మండలంలోని 15 ఉన్నత పాఠశాలల నుం చి 434 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 400 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 15 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు తురుకల మద్దికుంట, రాగినే డు, బ్రాహ్మణపల్లి, కొత్తపల్లి, మారేడుగొండ జిల్లా పరిషత్ పాఠశాలలు, పెద్దపల్లి గవర్నమెంట్ హైస్కూల్‌లు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఉత్తమ ప్రతిభ కనబరచిన వి ద్యార్థిని విద్యార్థులను జిల్లా విద్యాధికారి మాధవి, మండల విద్యాధికారి సురేందర్ కుమార్, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి రాంరెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఎలిగేడు : ఎలిగేడు, ధూళికట్ట, సుల్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో కవిత తెలిపారు. ధళికట్టలో 20మంది, ఎలిగేడులో 22మంది, సుల్తాన్‌పూర్‌లో 22మంది పాసైనారని, శ్రీజ 9.5. దినేష్ 9.3, సంకీర్తన 9.3. తన్మయ 8.8 జీపీఏ సాధించారని ఆమె పేర్కొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలో ప్రభుత్వ 10 ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా బాలికల విద్యాలయం, మోడల్స్ స్కూల్‌లలో మొత్తం 247మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 242 మంది ఉత్తీర్ణులైనారు. గంగారం, మల్యాల మొట్లపల్లి, పెగడపల్లి, తారుపల్లి, వెన్నంపెల్లి, కస్తూర్బా బాలికల పాఠశాలలో 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనారు. కునారంలో 75శాతం, మిర్జంపేటలో 80 శాతం, పందిల్లలో 88 శాతం, కాల్వ శ్రీరాంపూర్‌లో 95శాతం, మోడల్ స్కూల్‌లో 99శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనారు. పెగడపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన సాయిండ్ల అజయ్ కుమార్, కూస మేఘనలకు 9.8 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో మండలంలో మొదటి ర్యాంకు సాధించారు. 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో సురేందర్ తెలిపారు.

ఓదెల : మండలంలో పదవ తరగతి పరీక్షల్లో ఓదెల జడ్పీహెచ్‌ఎస్, కొలనూర్ హై స్కూల్, కస్తూర్బా గాంధీ హై స్కూల్‌లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే కస్తూర్బా గాంధీ పాఠశాలకు చెందిన కావటి స్రావ్య 9.7జిపిఏ సాధించి మండల టాపర్ నిలిచింది. అలాగే ద్వితీయ స్థానంలో మోడల్ హై స్కూల్ విద్యార్థులు నిలిచారు. ఓదెల హైస్కూల్లో 22 మంది, కొలనూర్ హైస్కూల్లో 16 మంది, ఓదెల కస్తూర్బాగాంధీ బాలికల హైస్కూల్లో 51 మంది 100 శాతం ఉత్తీర్ణులై అయ్యారు. అలాగే మోడల్ హైస్కూల్లో 93కు 90 మంది ఉత్తీర్ణత సాధించగా, ఇందులో టి. ఇంద్ర, సాయి హర్షిత, ఐలు శివతేజ, పర్ష అమూల్య 9.5 జీపి సాధించగా, ఎన్ రిషిత 9.3 బి.హర్షిత, బి. హరిప్రియ 9.2 గ్రేట్ సాధించింది.అలాగే మండలంలోని ఏడు హైస్కూల్లో మొత్తం 237 మందికి 231 మంది విద్యార్థులు ఈసారి ఉత్తీర్ణత శాతాన్ని 97.4శాతం వరకు సాధించారు. ఉత్తీర్ణులు అయ్యి ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతను చాటిన విద్యార్థులను ఎంఈవో రాజయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ అభినందించారు.

మంథని : ఎస్‌ఎస్‌సీ బోర్డు విడుదల చేసిన 10వ తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో మంథని మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభను కనబర్చి ఉత్తమ ఫలితాలు సాధించారు. వీరికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభినందలు తెలియజేశారు. మంథని కృష్ణవేణి హైస్కూల్‌లో సాదుల శ్రీనిజ 10, స్థానిక జెడ్పీపీ హెచ్‌ఎస్ గర్ల్స్‌లో బీ. దీప్తి 9.7, బాలుర పాఠశాలలో జే. విశాల్ 9.7, యశ్వంత్ 9.7, ఎక్లాస్‌పూర్ స్కూల్‌లో ఎస్.అనస్మిక 9.7, గుంపదుగు స్కూల్‌లో బీ. తన్వీ 9.3, కన్నాలలో వంశీవర్మ 8.5, ఆరెందలో ఏ. అశ్విని 8.5, జే. జోత్నలక్ష్మి 8.5, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏ. సాయిరాజా 7.8 జీపీఏ సాధించారు. కృష్ణవేణిలో 13 మంది విద్యార్థులు 9 జీపీఏ సాధించనట్లు హెచ్‌ఎం జాఫర్ తెలి పారు. స్థానిక కాకతీయ ఉన్నత పాఠశాలల్లో సూర్యమణి దీప్, అశ్వీత, హరిక, శ్రీవిన్య విద్యార్థులు 10 పాయింట్లు, 11 మంది విద్యార్థులు 9 జీపీఏ సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ముత్తారం : మండలంలోని ఆదర్శ, కస్తూర్బా పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండు పాఠశాలల్లో బాలికలదే హవాగా నిలిచింది 9.8తో మండల టాపర్‌లుగా నిలిచారు. ఆదర్శ పాఠశాలలో మాదాసి శరణ్య 9.8 శ్రీపతి సంజన 9.7మిన్నపురం రచన 9.7 కస్తూర్బా పాఠశాలలో మేడకొండ అక్షర 9.8 గర్రెపల్లి వర్షిని 9.5గోనెల చైతన్య 9.8గా మార్కుల సాధించారు. ప్రిన్స్‌పాల్స్ రాజేశ్వరి, కమలలు అభినందించారు.

జ్యోతినగర్ : ఎన్టీపీసీ పరిధిలోని వివిధ పాఠశాలలకు చరదిన 10వ తరగతి విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు చెందిన 6గురు విద్యార్థులు 10/10 జీపీఏను సాధించారు. కే.శ్రీమాన్, ఐ.సుదీప్తి, ఎం.శ్రీకరి, జి.శ్రీవైష్ణవ్, ఒ.ఈషేశ్వరి, టి.కుందన 10 జీపీఏ సాధించారు. 10 జీపీఏ, ఉత్తీర్ణులైన విద్యార్థులను సచ్‌వేవ ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్ అభినందించారు. విశ్వభారతి పాఠశాలకు చెందిన ఎస్‌ఎస్‌సీ విద్యార్థులు మెరుగైన ఫలితాలను సాధించారు. పాఠశాలకు చరదిన సాత్విక్ చరణ్ 10 జీపీఏ సాధించు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల 85.5 శాతం ఉత్తీర్ణత సాధించింది.

కోల్‌సిటీటౌన్ : పదో తరగతి ఫలితాల్లో గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి స్కూల్‌కు చెందిన ఐదురుగు విద్యార్థులు 10జీపీఏ సాధించారు. పీ.సాత్విక్, కె.సాయినాథ్, ఎండి నిహాల్, శ్రేయస్, ఎం.విఘ్నేష్ 10 జీపీఏ సాధించగా 9.8, 9.0 జీపీఏ 56 మంది విద్యార్థులు సాధించారు. కాగా పాఠశాల ఆవరణలో డైరెక్టర్ మంజులాశ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. అలాగే గాంధీనగర్‌లోని గీతాంజలి హైస్కూల్‌కు చెందిన కె.వైష్ణవి, టి.శశాంక్‌లు 10 సాధించారు. కరస్పాండెంట్ కంది రవీందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. నారాయణ స్కూల్‌కు చెందిన ఏడుగురు 10 జీపీఏ సాధించారు. ఎం.సాత్విక్, ఎం.హాసిని, వర్షిని, శ్రేయస్, సిరిహాసిని, ఓం దేవేంద్రపాటిల్, శ్రీశాంత్, సంతోషిలు 10 జీపీఏ సాధించారు. ఏజీఎం చైతన్యరావు, ప్రిన్సిపాల్ రజిని, అకాడమిక్ డీన్ ఆంజనేయులు విద్యార్థులను అభినందించారు. శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన ఏడుగురు 10 జీపీఏ సాధించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. రెయిన్‌బో హైస్కూల్‌కు చెందిన నలుగురు 10 జీపీఏ సాధించారు. కరస్పాండెంట్ అమరేందర్ వారిని అభినందించారు. కాగా, గోదావరిఖని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల బాలుర(రామగుండం)లోని ఊరగొండ అభిజిత్, నల్లాల రాంచరణ్, వీ.శ్రీ రాంచరణ్ 10 జీపీఏ, మరో ముగ్గురు ఏ.అఖిల్‌వర్మ, జశ్వంత్, జీ.విష్ణువర్ధన్‌లు 9.8 జీపీఏ సాధించారు. పాఠశాల 98.5శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ రజిత, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే స్థానిక మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో 8 మందికి 10 జీపీఏ సాధించారు. ఆడెపు శ్రీవిద్య, అబ్బ సింధు, సలేంద్ర హారిక, దబ్బేట సాయిమాధవి, యాసర్ల పరిమళ, సింగం సింధు, ఎల్.సిరి, కొట్టె పూజితలకు 10 జీపీఏ సాధించగా, మరో 8 మందికి9.8 జీపీఏలు సాధించారు. కాగా గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రజిత, ఉపాధ్యాయులు అభినందించారు.

యైటింక్లయిన్‌కాలనీ : కాలనీ పరిధిలోని పాఠశాలల్లో ఐదుగురు విద్యార్థులు 10/10 సాధించారు. మంగళవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో స్పందన మోడల్ స్కూల్‌కు చెందిన ఈ పల్లవి, శ్రీవాత్సవ, ఎండీ రియాన్‌లు 10/10 సాధించారు. హరిణి 9.7, సౌమిత్ 9.5 గ్రేడింగ్ సాధించారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన జీ చర ణ్య, ఎం శ్రీరాంలు 10/10 సాధించగా మధుహ 9.8, ప్రియ వందన 9.8, హన్సిత 9.7 గ్రేడింగ్‌లు సాధించారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో విజయకేతనం ఎగురవేశారు. పది మంది విద్యార్థులు పది జీపీఏలు సాధించి అగ్ర స్థానంలో నిలిచారు. వీరందరినీ అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి అభినందించారు. కేరళ మాడల్ స్కూల్‌కు చెందిన టి సాయి సిరి, ఆర్ శ్రీ హర్షితలు 10జీపీఏలు సాధించారు. స్కూల్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు కరస్పాండెంట్ సిద్దూ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ హైస్కూల్స్‌లో 93 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 11 హైస్కూల్స్ ఉండగా, ఒక కస్తూర్బా స్కూల్, ఒక సోషల్ వేల్ఫేర్ గురుకుల స్కూల్ ఉంది. వీటిన్నింటి నుంచి 328 మంది పరీక్షలు రాయగా, 306 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని కనుకుల హైస్కూల్, రేగడిమద్దికుంట హైస్కూల్, సాంబయ్యపల్లి హైస్కూల్, తొగర్రాయి హైస్కూల్స్ వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. సుల్తానాబాద్ ప్రభుత్వ హైస్కూల్ నుంచి హారిక 9.8; సుల్తానాబాద్ బాలుర హైస్కూల్‌లో అంజన్న 9.3, గర్రెపల్లి హైస్కూల్ నుంచి అమూల్య 9.3 జీపీఏ సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంఈవో సురేందర్ అభినందించారు. సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన ఆరుగురు, పది జీపీఏలు సాధించారు.

జూలపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో బాషిని, పిట్టల శ్వేత 10జిపిఏలు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. చారుహాషిని, గుమ్మడి వికిత, ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థి కే. హేమలత, మాడల్‌స్కూల్ విద్యార్థి ఎస్ భవాని, కస్తూరిబా పాఠశాల విద్యార్థి హరిచందన, న్యూబ్రిలియంట్‌లో శ్రీనిత్య, ఆశీష్‌లు 9.7 జిపిఏలు సాధించారు. మండల వ్యాప్తంగా 262 మంది విద్యార్థులు పరిక్షలు రాయగా 248మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు, మండల వ్యాప్తంగా 94.65శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో కవిత తెలిపారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం

- పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 30: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని, నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుతో కలిసి ఆయన కార్నర్ సమావేశంలో మాట్లాడారు. తాను ఒక స్వచ్ఛంద సంస్థ పెట్టి 500 మంది యువకులకు ఉద్యోగాలు కల్పించానని, తనకు ఎంపీగా అవకాశం ఇస్తే పెద్దపల్లి అభివృద్ధితో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. రేషన్ కార్డులు కూడా లేని వారికి రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల విద్యుత్ మాఫీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్‌తో పాటు వచ్చే పంద్రాగస్టులోపు రైతులకు రెండు లక్షల రుణమాఫీ జరుగుతుందన్నారు. వచ్చే వానకాలం పంట నుంచే రూ.500లు రైతులకు బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ కేంద్రంలో రాహుల్ ప్రధానమంత్రిని చేస్తే ఐదు పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. స్వామినాథన్ కమిటీ ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధర, ఉపాధి హామీ కూలీలకు రూ.400 కూలీ, ప్రతి తెల్ల రేషన్ కార్డు ఉన్న మహిళకు లక్ష రూపాయలు, సంవత్సరానికి 30లక్షల ఉద్యోగాలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.25 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇండ్లు లేని వారందరికీ జూన్ 15 నుంచి ఇందిరమ్మ ఇండ్లకు ఐదు లక్షలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మాజీ మత్స్యశాఖ రాష్ట్ర అధ్యక్షుడు చేతి ధర్మయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అప్పుల తెలంగాణగా మార్చారు..

ఓదెల, ఏప్రిల్ 30 : నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో పాలనలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలించి అప్పుల తెలంగాణగా మార్చారని కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే విజయరమణరావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌తో కలిసి వంశీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వంశీ మాట్లాడుతూ ఉపాధి పథకాన్ని 20 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మండల అధ్యక్షులు మూల ప్రేంసాగర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి కొరతను నివారణకు చర్యలు

- మంతని చైర్‌పర్సన్ రమసురేష్‌రెడ్డి

మంథని, ఏప్రిల్ 30: మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డులో మంచినీటి కొరతను తీర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి వెల్లడించారు. స్థానిక పోచమ్మవాడలో నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని అధికారులతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించి మట్టి నమునాలను సేకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంతో మున్సిపాలిటీలో నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణం చేయటానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి అనుమతి పొందినట్లు తెలిపారు. సుమారు 8 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో 22 కి.మీ. పైప్‌లన్‌తో ఈ నూతన వాటర్ ట్యాంక్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈట్యాంక్ ద్వారా మున్సిపాలిటీలో అన్ని వార్డుల ప్రజలకు సంపూర్ణంగా సాగునీటిని అందించడానికి వీలు కల్గుతుందన్నారు. త్వరగా నిర్మాణం పూర్తి చేసుకునే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ శ్రీపతి బానయ్య, కౌన్సిలర్లు చొప్పకట్ల హన్మంతు, వీకే. రవి, లింగయ్య, కమీషనర్ మల్లికార్జున్ స్వామి, కొట్టె రమేష్, నక్క శంకర్‌లు పాల్గొన్నారు.

ఇంటర్‌లో తల్లి.. టెన్త్‌లో కూతురి ప్రతిభ



తల్లి గీతారాణితో కూతురు చిట్టోజు చందన

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 30: గోదావరిఖనికి చెందిన చిట్టోజు రమణాచారి-గీతారాణి దంపతుల కూతురు చందన రామగుండం లింగాపూర్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివింది. మంగళవారం విడుదలైన టెన్త్ ఫలితాల్లో చందన 10 జీపీఏ సాధించింది. కాగా, చందన తల్లి గీతారాణి ఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఒకేషనల్‌కోర్సు(పీఎస్‌టీటీ) చదివి ఇటీవల విడుదలైన ఫలితాల్లో 954 మార్కులు సాధించింది.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేదాజ్ఞలు

కోల్‌సిటీ, ఏప్రిల్ 30: రామగుండం కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అనుమతిలేని డ్రోన్లు, డీజే సౌండ్ల వినియోగంపై నిషేదాజ్ఞలు పొడగించినట్టు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు చేస్తున్న ఆగడాలపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. మద్యం సేవించి రోడ్లపై అసభ్య పదజాలంతో మాట్లాడడం, ప్రజలకు ఇబ్బంది కలిగించడం వంటివి చేస్తున్నారన్నారు. వీరి ఆగడాలకు కల్లెం వేసేందుకు నిషేదాజ్ఞలు మే 1వ తేది నుంచి జూన్ 1వ తేది వరకు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే డీజే సౌండ్ల వినియోగంపై కూడా నిషేదాజ్ఞలు పొడగించామన్నారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ కోసం డీజే సౌండ్లు వినియోగిస్తున్నారన్నారు. వివిధ కార్యక్రమాలకు మైక్‌సెట్ అనుమతి తప్పనిసరి అయితే ఏసీపీ ద్వారా అనుమతి పొందాలన్నారు.

పదవీ విరమణ చేస్తున్న సిబ్బందికి సీపీ సత్కారం

పదవీవిరమణ ప్రతి ఉద్యోగికి తప్పదని, పదవీవిరమణ చేసిన ఉద్యోగులు భావి జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఆనందంగా, ప్రశాంతంగా గడుపాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ఆకాంక్షించారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో పదవీవిరమణ చేస్తున్న నలుగురు ఎస్‌ఐలను సీపీ ఘనంగా సత్కరించారు. టీ విక్టర్, ఎన్ సురేందర్, టీ గంగరాజుగౌడ్, ఎన్ లింగన్నలు పదవీవిరమణ చేయగా వారికి శాలువాలు కప్పి సీపీ సత్కరించారు.

ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, సీసీ ఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌బాబు, ప్రేమ్‌కుమార్, ఏఓ అశోక్‌కుమార్, సూపరింటెండెంట్లు ఇంద్రసేనారెడ్డి, సంధ్య, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం పాల్గొన్నారు.



ఉద్యోగులకు సత్కారం

రామగిరి, ఏప్రిల్ 30: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో పనిచేసి పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు మంగళవారం ఘనంగా సత్కారించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సివిల్ విభాగంలో పని చేసే జూనియర్ ఇంజనీర్ నల్లరాజేశం, పర్సనల్ విభాగంలో పనిచేసే డిప్యూటి సూపరిటెండెంట్ కళ్యాణం సుధాకర్‌లను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, వివిధ విభాగాలకు చెందిన అదికారులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదికారులు ఎలీషా, రఘుపతి, సత్యనారాయ ణ, శ్రీనివాసులు, వెంకటరమణ, చంద్రశేఖర్, ముప్పిడి రవీందర్‌రెడ్డి, రాజారెడ్డి, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

వేసవి దృష్ట్యా పనివేళలు మార్చాలని వినతి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 30: పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ఓసీపీ-1 పని వేళలు మార్చాలని ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ ప్రాజెక్టు యాజమాన్యాన్ని కోరింది. యూనియన్ సెంట్రల్ కమిటీ సభ్యుడు గడ్డం తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గడ్డం తిరుపతి, వెంకటస్వామి, చంద్రశేఖర్, సయ్యద్‌సలీం, రామచందర్‌రావులు ఉన్నారు.

ఐఎన్‌టీయూసీ ఓసీపీ-1 పిట్ కమిటీ పరిచయ కార్యక్రమం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 30: సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ ఓసీపీ-1 పిట్ కమిటీతో పాటు ఇతర కమిటీలను సెంట్రల్, బ్రాంచి నాయకులు ప్రాజెక్టు అధికారులకు మంగళవారం పరిచయం చేశారు. పీవో రాధాకృష్ణ, పీఈ శ్రీనివాస్, మేనేజన్ ఉదయ్ హరిజన్‌లతో జరిగిన పరిచయ కార్యక్రమంలో ఆర్జీ-3 వైస్‌ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి, నాయకులు గడ్డం తిరుపతి, శ్రీనివాసరావులు పాల్గొన్నారు. పిట్ సెక్రెటరీలుగా వెంకటస్వామి, సదానందం, సయ్యద్ సలీం, కుమారస్వామి, మహిళా పిట్‌సెక్రెటరీగా శైలజతోపాటు షిఫ్ట ఇన్‌చార్జిలు, సేఫ్టీ, మైన్స్ కమిటీ సభ్యులను పరిచయం చేశారు.

వేసవి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు



క్రీడ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి, ఏప్రిల్ 30: సింగరేణి యాజమాన్యం కల్పించే వేసవి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొవాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని రాణిరుద్రమాదేవి క్రీడా ప్రాంగణంలో వర్క్.పీపుల్స్‌అండ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ రకాల ఉచిత క్రీడా శిక్షణ తరగతులను జీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పిల్లల శారీరకదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 25 రోజుల పాటు నిర్వహించే వివిధ క్రీడాశిక్షణలను సద్వినియోగం చేసుకొవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదికారులు రఘుపతి, సిహెచ్ వెంకటరమణ, ముప్పిడి రవీందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, సునీల్‌ప్రసాద్, క్రీడాకారులు వెంకటనరసింహరెడ్డి, అంజి, ప్రసాద్, వెంకటేశ్వర్లు, శిక్షకులు ముఖేష్‌కుమార్, నాగరాజు, రవీలతో పాటు అదికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్

గోదావరిఖని, ఏప్రిల్ 30: పారిశ్రామిక ప్రాంతంలో కార్మిక కుటుంబాలకు, పిల్లలకు, యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని జీడీకే వన్ సీఎపీ, 2ఇంక్లైన్, సింగరేణి ఏరియా ఆసుపత్రిలో ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు.

స్వీట్ల పంపిణీ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 30: శ్రీరాంపూర్ జీఎం కార్యాల యంలో మేడేను పురస్కరించుకొని అధికారులు, సిబ్బందికి ఏఐటీయూసీ నాయకులు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా జీఎం సంజీవరెడ్డి మాటాడుతూ, ఏరియా కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం ఆఫీస్ పిట్ కార్యదర్శి గొల్లపల్లి రాంచందర్, సహాయ కార్యదర్శి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 30: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో మేడే పోస్టర్‌న నాయకులు ఆవిష్కరించారు. 138వ మేడే ఉత్సవాలను ఏరియా పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త మేడే ఉత్సవాల్లో పాల్గొనేలా పిట్ కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో యూనియన్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్, సెక్రెటరీ రాజారత్నం, బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, వైస్ ప్రెసిడెంట్ అన్నారావు, నాయకులు శ్యాంసన్, సాంబశివరావు, ఎన్ వెంకటేశ్వర్లు, బుర్ర తిరుపతిలు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..

రామగిరి, ఏప్రిల్ 30: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధీలోని తొటమాలి, సివిల్ విభాగాల్లో మే డే పోస్టర్‌ను మంగళవారం ఐఎఫ్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల వెంకన్న ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం కదలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సదానందం, రమేష్, శ్రీను, రేణుక, లక్ష్మి, వసంత, తిరుమల, భాగ్య, రమేష్, రాజేశం, హరిక, తదితరులు పాల్గొన్నారు.